పార్టీ అయిపోయింది. అందరూ మంగారావుకి షేక్‌హ్యాండిస్తూ బెస్టాఫ్‌లక్ చెప్పారు. చివరగా మంగారావు లిల్లీ దగ్గరకి వచ్చాడు.

"ఇప్పుడు నేనో చిన్న పని చేయ్యబోతున్నా.....మీరెవరూ అపార్థం చేస్కోరని భావిస్తాను" అక్కడి వాళ్ళని ఉద్దేశించి అన్నాడు మంగారావు.

"చేస్కోం" అన్నారు అందరూ కోరస్‌గా.

"లిల్లీ నా కూతుర్లాంటిది" అన్నాడు మంగారావు.

అందరూ ఫకాల్మని నవ్వి" అవును...అవును" అంటూ బుర్ర కాయలూపారు.

"కూతుర్ని దగ్గరికి తీస్కుంటే తప్పులేదనుకుంటాను?"

"అస్సలు లేదు" పగలబడి నవ్వుతూ అన్నాడు.

మంగారావు లిల్లీని దగ్గరకి తీసుకున్నాడు.

అందరూ కసిగా చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు.

"లిల్లీ....నువ్వు కూడా అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చెయ్" లిల్లీ చెవులో అన్నాడు మంగారావ్.

"ఉండండి సార్...!అంత కంగారయితే ఎలా? ఆ వచ్చే కొత్త బాస్ ఎలా వుంటాడో చూసుకుని వస్తా" లిల్లీ మంగారావు చెవిలో అంది.

"అంటే వాడికి నచ్చితే సెటిలయిపోతావా హత్తేరి!"

"చూద్దాం అంటున్నాగా" విసుక్కుంది లిల్లీ.

"సొంత తండ్రి కూడా కూతుర్ని ఇంతసేపు కౌగలించుకోడు కద్సార్" గుంపులోంచి ఎవరో అరిచారు.

"హత్తేరి.....ఎవరయ్య అదీ? సొంత కూతురైతే ఎప్పుడూ అందుబాటులో వుంటుంది ఇలాంటి కూతుర్లాంటిదైతే ఎప్పుడోగానీ చేతికి దొరకదు కదా....... హత్తేరి?" కసురుకుంటూ అన్నాడు మంగారావ్.

0 0 0

బుచ్చిబాబు ఇంటివైపు నడుస్తూ ఉన్నాడు. అతని బుర్రలో ఎన్నో ఆలోచనలు.

వారం క్రితం జరిగిన సంఘటన అతని మెదడుని తొలిచేస్తోంది.

సీత ఇంక కన్విన్సు కాదు? అలాంటప్పుడు ఎందుకు ఇక్కడికి వచ్చింది? తన ప్రక్కన పడుకోవలసి వస్తుందని వచ్చేముందు ఊహించలేదా? వట్టి పడుకోవడమేనా ఇంకా చాలపనులు చెయ్యాల్సి వుంటుందని తెలీదా?

తల్లిదండ్రులకి అబద్దాలు చెప్పి ఇంత దూరం వచ్చింది సీత ఒక గదిలో చాపమీద, తను మరో గదిలో మంచం మీద పడుకోవడానికా?

అనవసరంగా సుందర్‌గాడి మాటలు విని పెళ్ళి కాన్సిల్ చేస్కున్నాడా? తల్లిదండ్రులు పెట్టిన ముహూర్తానికే బుద్ధిగా సీతని పెళ్ళి చేసుకుని వుండి వుంటే ఈ పాటికి ఎన్ని మధురమైన రాత్రులు సీతతో గడిపి ఉండేవాడు?

తను పొరపాటుగానీ చేయలేదు గదా?

నో....తనదేం పొరపాటు కాదు. పెళ్ళయి వుంటే ఇద్దరికి ఈ పాటికి ఒకరంటే ఒకరికి మోజు తగ్గిపోయి కీచులాడుకుని చస్తుండేవారు.

ఆ కిరణ్‌గాడు అంతేగా? పెళ్ళివల్ల వాడి ప్రేమ మున్నాళ్ళ ముచ్చటయింది.

సీతని ఎలాగయినా సరే తన దారికి తెచ్చుకోవాలి!

బుచ్చిబాబు ఇలా ఆలోచిస్తుండగానే ఇల్లు వచ్చేసింది. బుచ్చిబాబు డోరు బెల్ నొక్కాడు. తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఎవరో పాతికేళ్ళ అమ్మాయి.

"ఓ... అయామ్ సారీ! ఏదో ఆలోచిస్తూ మా ఇల్లనుకుని మీ ఇంటి బెల్ నొక్కా సిల్లీగా....సారీ మేడమ్.....వెరీ వెరీ సారీ.........." కంగారుగా అని వెనక్కి తిరిగి రెండడుగులు వేశాడు బుచ్చిబాబు.

"ఏయ్ బుచ్చి" వెనుక పిలుపు.

బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

ఇదేంటి......ఈవిడెవరో నన్ను చనువుగా బుచ్చీ అని పిలుస్తోంది? అసలు ఈమె కంత చనువెవరిచ్చారు సిల్లీగా?

బుచ్చిబాబు సీరియస్‌గా మొహం పెట్టి వెనక్కి తిరిగి చూసాడు. ఆ అమ్మాయి భుజాలమీదుగా వెనుక నుండి సీత చూస్తోంది.

"నీ బొంద! ఇది మన ఇల్లే" అంది సీత.

బుచ్చిబాబు సిల్లీగా కన్‌ఫ్యూజ్ అయినందుకు తనని తనే తిట్టుకున్నాడు. ఓ వెర్రినవ్వు నవ్వి వాళ్ళని సమీపించాడు.

"ఈమె రాధ. హైదరాబాద్‌లో నా హాస్టల్‌మేట్!" పరిచయం చేసింది సీత.

"హలో"అన్నాడు బుచ్చిబాబు.

"హలో" ప్రతిగా అంది రాధ.

"ఆమెని నాకు పరిచయం చేసావుగానీ నన్ను ఆమెకి పరిచయం చేయవేం సిల్లీగా?" సీతతో అన్నాడు బుచ్చిబాబు .

"ఒట్టి పరిచయం ఏంటి? మీ చరిత్రంతా నాకు చెప్తేనూ?" అంది రాధ బుచ్చిబాబుతో.

"చరిత్ర వుండడానికి నేనేమైనా మహా పురుషుడినా?" వెర్రి నవ్వు నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు .

"కానీ చరిత్రకెక్కే పనులు చేస్తున్నారుగా?"

ఆమె తనని పొగుడుతోందో వ్యంగ్యంగా అంటోందో బుచ్చిబాబుకి అర్థంకాలేదు.

"సరే....ముందు లోపలికి రా..... తీరుబడిగా మాట్లాడుకుందాం" అంది సీత బుచ్చిబాబుతో.

ముగ్గురూ లోపలికి వెళ్లారు. బుచ్చిబాబు మొహం కడుక్కున్నాక సీత ముగ్గురికీ కాఫీ కలిపి పట్టుకొచ్చింది.

కాఫీ సిప్ చేస్తూ బుచ్చిబాబు రాధని అడిగాడు "ఈ ఊరికి ఏ పని మీదయినా వచ్చారా?"

"ఊ......మీ పనిమీదే వచ్చాను" కూల్‌గా అంది రాధ.

"మా పనా?"ఆశ్చర్యంగా రాధ, సీత మొహాలవంక మార్చి మార్చి చూస్తూ అడిగాడు బుచ్చిబాబు.

"అవును....పాపం సీత నాకు చాలా బాధపడుతూ ఉత్తరం రాసింది" గంభీరంగా అంది రాధ.

తాగుతున్న కాఫీకప్పును టీపాయ్ మీద పెట్టేసి సడన్‌గాలేచి నిల్చున్నాడు బుచ్చిబాబు "అర్రె! ఈపూటకి కూరగాయలు లేనట్టున్నాయే! ఉండండి ఇప్పుడే బజారుకెళ్ళి కూరగాయలు తెస్తా"

హడావుడిగా బయటికెళ్ళిపోయాడు బుచ్చిబాబు.

సీత దిగులుగా రాధవంక చూసింది.

"ఎంతసేపు అలా తప్పించుకుని తిరుగుతాడు....... ఇంటికి రాడా ఏంటి?" అంది రాధ సీత భుజం తట్టి ధైర్యం చెబుతూ.

0 0 0

రాత్రి తొమ్మిది గంటలయింది. అప్పుడే ముగ్గురూ భోజనాలు ముగించి డైనింగ్ టేబుల్‌ముందు నుంచి లేచారు. ముగ్గురూ హాల్లోకి వచ్చి కూర్చున్నారు. బుచ్చిబాబు టీపాయ్‌మీద వున్న వక్కపొడి డబ్బాలోంచి కాస్త వక్కపొడి తీసుకుని నోట్లో వేసుకున్నాడు.

రాధ గొంతు సవరించుకుంది.

" బుచ్చిబాబు గారూ......మీతో కాస్త మాట్లాడాలి"అంది

బుచ్చిబాబు దీర్ఘంగా ఆవులించి "అబ్బా...నాకు చాల నిద్రొస్తోందండీ....రేపు మాట్లాడుకుందాం....నిద్రపొండి"అంటూ గభాలున లేచి బెడ్‌రూంలోకి వెళ్ళి మంచం మీద పడ్డాడు.

రాధ ఎందుకు వచ్చిందో అతనికి అర్థం అయింది. అందుకే ఆమెని ఎవాయిడ్ చేస్తున్నాడు బుచ్చిబాబు . సీతకొట్టే సుత్తి భరించలేకపోతుంటే ఇంక రాధకొట్టే సుత్తి కూడా భరించాలా?

బుచ్చిబాబు రూంలో పడుకున్నాడు. సీత, రాధ హాల్లో చాప మీద పడుకున్నారు.

అలా ఆలోచిస్తూ నిద్రలోకి వరిగాడు బుచ్చిబాబు. అర్థరాత్రి హఠాత్తుగా మెలుకువ వచ్చింది బుచ్చిబాబుకి. ఎవరో డోర్ బెల్ నొక్కుతున్నారు. బుచ్చిబాబు గడియారంవంక చూశాడు.

ఒంటిగంటయింది.

"ఇంత అర్థరాత్రి ఎవరొచ్చుంటారబ్బా?" అనుకున్నాడు.

డోర్ బెల్ ఆగకుండా మోగుతోంది.

బుచ్చిబాబు విసుక్కుంటూ హాల్లోకి వచ్చాడు. హాల్లో సీత రాధ చాపమీద నిద్రకళ్ళేసుకుని కూర్చుని వున్నారు.

"ఆలా వెర్రిమొహం వేసుకుని చూడకపోతే తలుపు తియ్యొచ్చుగా?" సీత వంక మొహం చిట్లించి చూస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"బాగానేవుంది. ఇంత అర్థరాత్రి ఎవరో బెల్ నొక్కుతుంటే ఆడవాళ్ళం మేమెలా తలుపులు తీస్తాం?" విసుక్కుంటూ అంది సీత.

"సరే.....సరే........"అంటూ బుచ్చిబాబు వీధి తలుపు గడియ తీశాడు.

ఎదురుగా సుందర్! చేతిలో సూట్‌కేసుతో.

సుందర్‌ని చూడగానే బుచ్చిబాబుకి కొండంత అండ దొరికినట్టయింది.

"ఒరేయ్ సుందర్" సుందర్‌ని గట్టిగా కౌగలించుకున్నాడు బుచ్చిబాబు.

0 0 0

సుందర్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఊ......షానా బాగున్నది. మగ పురుషుల మనము ఇద్దరమూ ఈ మంచముమీద ఆడస్త్రీలు ఇద్దరూ హాలునందు నేలమీద.....షానా షానా బాగున్నాది".

బుచ్చిబాబుకి ఒళ్ళు మండిపోయింది.

"నువ్వూర్కే నా చెవిలో రైలింజనులా బుస్‌బుస్‌మని అలా నిట్టూర్చకు. నాకు చెడ్డ చిరాకొచ్చేస్తుంది. అంతా నీవల్లే అయ్యింది. నీ మాటలు విని నిక్షేపంగా జరగబోయే పెళ్లిని ఆపుకున్నా.........లేకపోతే ఈ పాటికి సీత నేనూ హాయిగా పక్కపక్కన పడుకుని ........ .ప్చ్ ..... ఇప్పుడనుకుని ఏం లాభం సిల్లీగా"

"మిస్టర్ బుష్షిబాబూ.....ఇంకా ఎక్కువ మాట్లాడిన యడల నిన్ను షూట్ చేయుదును. నువ్వు డబుల్ స్టాండర్సుతో మాట్లాడుషున్నావు. షీటతో పెండ్లి ఇస్టము లేదు అనుషున్నావు నాతో పెండ్లి ఇష్టము అనుషున్నావు. నీ ఉద్దేషము ఏమి?" సుందర్ మొహం చిట్లిస్తూ అన్నాడు

"నిజమేననుకో. నాకు పెళ్లి చేసుకుని ప్రేమను చంపుకోవడమ ఇష్టం లేదు. కానీ సీతని కన్విన్సు చేయలేకపోతున్నాన్! అందుకే నాకు చాలా బాధగావుంది. నన్ను అసలు దగ్గరికి రానివ్వడంలేదు" బాధగా అన్నాడు బుచ్చిబాబు .

"అమెరికాలో ఇటుల దగ్గిరకు రానివ్వని యడల షూట్ చేయుదురు. తెలుసునా?"

"నీ అమెరికాని దొంగలు తోలా? ఓ ప్రక్క బాధతో నేను చస్తుంటే అమెరికాలూ, షూటింగ్సూ అంటూ అఘోరిస్తావేం?" పళ్ళు కొరికాడు బుచ్చిబాబు.

"ఇటుల పళ్ళు కోరికినను అమెరికాలో షూట్ చేయుదురు".

"ఈ....." బాధగా జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు "ఇటుల జుట్టు పీక్కునిన ఎడల అమెరికాలో షూట్ చేయుదురు అని మాత్రం అనకు. పీక పిసికి మంచంమీదనుంచి క్రిందకి తోసేస్తా....."

"ఒక్కే....ఒక్కే....టేకీటిజీ! అటులయిన మీమధ్య ఏవిధమైన సంబంధం లేదు ....... అవునా?" అడిగాడు సుందర్ బుచ్చిబాబుని.

"లేదూ...లేదూ...లేదు"

"నేను షెవిటివాడను కాను...ఒక్కసారు షెప్పిన షాలును. సంబంధము లేనియడల సంబంధము బలవంతంగా కుదుర్చుకోనవలయున యూనో?"

"బలవంతంగానా? సిల్లీగా ఏం జోకేశావ్‌రా నా చిట్టితండ్రి. ఓ సారి ముద్దుపెట్టుకుంటేనే నా నడ్డి పగిలేలా మంచంమీద నుండి క్రిందకి తోసేసింది. ఆ దెబ్బకే నేనసలు సంసారానికి పనికొస్తానా అని అనుమానం కూడా వేసిందనుకో" బిక్క మొహం వేసి అన్నాడు బుచ్చిబాబు.

"హ హ హ వాటే జోక్" పొట్ట పట్టుకుని నవ్వాడు సుందర్.

"నా బాధ నీకు జోక్‌గా అనిపిస్తుందిరా?" ఉక్రోషంగా అన్నాడు బుచ్చిబాబు.

"నో నో నో...నీ బాధా-నా బాధ! అందుకే అంత దూరం నుండి వచ్చాన్"

"మంచి పని చేశావ్! నన్ను పీక్కు తింటానికి సీతకి తోడు రాధ కూడా వచ్చింది. నాకు తెలుసు....నన్ను పెళ్ళి చేసుకోమని అడగడనికే రాధ వచ్చింది "

సుందర్ ఉలిక్కిపడ్డాడు.

"షిట్! రాధ కూడానిన్ను పెళ్ళి షేషుకోమన్నదా? నువ్వు షీటను పెండ్లి షెశుకోనుటకే నువ్వు షిద్దముగా లేవు రాడను ఎట్లు పెండ్లి షేషుకోందువు?" ఆశ్చర్యంగా అన్నాడు సుందర్.

బుచ్చిబాబు నెత్తి కొట్టుకున్నాడు "నీ తెలివి మండినట్లే వుంది. రాధ తనను పెళ్ళి చేస్కోమని అడగడానికి రాలేదు. సీతని చేస్కోమనడగడానికి వచ్చింది".

"యూ డోంట్ వర్రీ! ఆమె విషయము కూడా నేను షూష్కుంటాను నీవు లైటు ఆర్పివేయుము. మేము పడుకుందుము అమెరికానందు ఇటుల అర్ధరాత్రి యందు షుత్తి కొట్టిన ఎడల షూట్ చేయుదురు" చిరాకుగా అన్నాడు షుందర్.

బుచ్చిబాబు ఓసారి జుట్టు పీక్కుని తర్వాత లైటార్పేశాడు.

ఇక్కడ హాల్లో.....

"ఓహో..అలాగయితే నీ బుచ్చిబాబు మనసు మార్చేసింది ఈ పోనీ టేయిల్ గాడన్నమాట" అంతదాకా సీత చెప్పింది విని అంది.

"అవును! మనిద్దరం బుచ్చిబాబు బ్రెయిన్ వాష్ చేద్దామని అనుకుంటే నా ఖర్మకాలి సమయానికి వచ్చాడు " అంది సీత.

"నువ్వు వర్రీకాకు....।ఆ షుందర్ సంగతి నేను చూస్కుంటా" సీతకి ధైర్యం చెప్పింది రాధ.

0 0 0

మర్నాడు బుచ్చిబాబు ఓ ప్లబిక్ బూత్ నుంచి ఆఫీసుకు ఫోన్ చేసి రెండురోజులపాటు ఆఫీసుకి రానని చెప్పేశాడు.

ఉదయం లేచిన దగ్గర్నుండీ ఆ ఇంట్లో గమ్మత్తయిన ఫార్సు జరుగుతోంది. వీలు చిక్కిన్నప్పుడల్లా రాధ, సుందర్ ఒకరినోరు కోర చూపులు చూస్కుంటున్నారు. ఇన్‌డైరెక్ట్‌గా దెప్పి పొడుచుకుంటున్నారు.

టిఫిన్‌గా అందరికీ ఇడ్లీ పెట్టింది రాధ.

"నాకు ష్పూను మరియు ఫోర్క్కా కావలేను. ఇటుల వట్టి షేటులతో తినిన ఎడల అమెరికాలో షూట్ షేయుదురు" అన్నాడు సుందర్.

సీత సుందర్‌కీ, బుచ్చిబాబుకీ స్పూను ఫోర్కులు ఇచ్చింది. రాధకి కూడా ఇవ్వబోతే "వద్దుల్లేవే.....నేనేం అమెరికాదాన్ని కాదు కదా అమెరికా పద్దతులు ఇండియాలో పెడితే ఏం బాగుంటుంది? ఆబగా మనం తింటున్నది ఇండియా ఇడ్లీనేగా అమెరికా ఇడ్లీ కాదుగా. ఇండియా ఇడ్లీని ఇండియా పద్దతిలో తింటేనే బాగుంటుంది" అంది రాధ సుందర్‌వైపు కోరగా చూస్తూ.